సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 5 । అక్టోబర్ । 2023



మహిళ దారుణ హత్య

వైఎస్సార్ జిల్లా పోరుమామిళలోని ముస్లింకోటలో షేక్ గౌసియాబేగం (38)ను అదే ప్రాంతానికి చెందిన సుబహాని దారుణంగా హత్య చేశాడు. -8లో



ఆధిక్యంలో నెల్లూరు జట్టు

కడపలోని కేఓఆర్ మైదానంలో జరుగుతున్న ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు, చిత్తూరు జట్లు ఆధిక్యాన్ని ప్రదర్శించాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.84	రూ.100
రెండోరకం	రూ.50	రూ.82



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 350 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	450	533
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1,782.520 కిలోలు

న్యూస్‌రీల్

14న మైసూర్‌కు ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ: దసరా సెలవులను పురస్కరించుకుని ఈనెల 14న మైసూర్‌కు ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. డిపో నుంచి 14న రాత్రి 9 గంటలకు బయలుదేరి 15న ఉదయం మైసూరు చేరుకుంటుందన్నారు. ప్యాలెస్, జూ, మ్యూజియం, బృందావన గార్డెన్స్, చాముండి హిల్స్, చైతన్య ఆశ్రమం చూసుకుని రాత్రి బయలుదేరి 16న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. అల్ట్రాడీలక్స్ పుష్ బ్యాక్‌సీట్లు ఉంటాయన్నారు. రానుపోను చార్జీ. రూ.1250 చెల్లించాలన్నారు. టిక్కెట్లు కావాలనుకునేవారు 9959225677, 916086645 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు ఉపాధ్యాయులకు సన్మానం

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను గురువారం జిల్లా పరిషత్‌లో సన్మానిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆకెపాటి ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో కడప, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గాల్లోని కొందరు ఉపాధ్యాయులను ఎంపిక చేశామన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతల నుంచి విరాళం అందుకుంటున్న ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్

చక్రాయపేట: వైఎస్సార్ జిల్లా గండి క్షేత్రంలోని వీరాంజనేయస్వామి సన్నిధిలో నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ వాసులు పుల్లగూర నాగభూషణం, రామలక్ష్మమ్మ దంపతులు మంగళవారం రు.1,00,116 విరాళం ఆలయ సహాయ కమిషనర్ ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్‌కు బుధవారం అందజేశారు. అర్చకులు కేసరి, వారిచే ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం



ప్రథమస్థానం దక్కించుకున్న చిత్రం



గంప మల్లయ్య

కడప ఎడ్యుకేషన్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న గంపమల్లయ్య రాజా రవివర్మ పురస్కారానికి ఎంపికయ్యాడు. తిరుపతి ఆర్ట్స్ సోసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీలకు 53 మంది కళాకారులు 95 వర్ణ చిత్రాలను పంపగా గంపమల్లయ్య చిత్రానికి ప్రథమ స్థానం దక్కింది.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లు.. నిస్వార్థ సేవకులు



పురస్కార గ్రహీతలతో వీసీ, రిజిస్ట్రార్, తదితరులు

వైవీయూ: సమాజ అవసరాలకు స్పందించే ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిస్వార్థ సేవకులు అని వైవీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. వైవీయూ పరిధిలోని క్యాంపస్, అనుబంధ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్‌లో చేరి సమాజానికి ఉత్తమ సేవలందించిన వారికి 'వైవీయూ ఎన్ఎస్ఎస్ పురస్కారాలు-2023' అవార్డుల ప్రదానం స్థానిక సీవీ రామన్ సైన్స్‌బ్లాక్‌లో బుధవారం జరిగింది. ముఖ్య అతిథి వీసీ మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల్లో సమాజసేవ, దేశసేవ, ఆర్మీలో పనిచేయడం విద్యలో భాగంగా ఉన్నాయన్నాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వలంటీర్లు సమష్టి సేవలు అందిస్తున్నారని అభినందించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, కళాశాలల ప్రిన్సిపల్స్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.ఎస్.వెంకటరామిరెడ్డి, అధ్యాపకులు డా.ఎస్.పి.వి.రమణ, డా.పి.సరిత, డా.రాజగోపాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం



ఈమె పేరు రమాదేవి. కలికిరి మండలం సీఎల్ ఆర్‌సీ లేఔట్‌లో సొంత ఇల్లు నిర్మించుకుంది.ఇంటి నిర్మాణానికి 1,80,000 ప్రభుత్వం అందజేసింది., ఇన్నేళ్లకు సొంతింటి కల నెరవేరిందని, జగనన్నకు తమ కుటుంబం రుణపడి ఉంటుందని ఆనందంతో చెబుతున్నారు.



ఈమె పేరు అనురాధ. కలికిరి మండలం సీఎల్ఆర్‌సీ లేఔట్ లో సొంత ఇల్లు నిర్మించుకుంది. సొంత ఇంటితో తమకు భవిష్యత్తునిచ్చిన జగనన్నకు రుణపడి ఉంటామని చెబుతోంది. ఇంటి నిర్మాణానికి సబ్సిడీలో 90 బ్యాగుల సిమెంటు 20 టన్నుల ఇసుకతోపాటు 1,80,000 అందిందని తెలిపారు.

- జిల్లాలో శరవేగంగా ఇళ్లనిర్మాణాలు
- లబ్ధిదారుల్లో ఆనందం



కలికిరి మండలంలోని జగనన్న కాలనీ లే అవుట్‌లోని గృహాలు

నియోజకవర్గం	లబ్ధిదారులు	పూర్తయిన ఇళ్లు
రాయచోటి	17567	5584
మదనపల్లె	14560	5808
పీలేరు	11695	5076
తంబళ్లపల్లె	11571	4054
రాజంపేట	10387	2839
కోడూరు	7141	2387

సాక్షి, రాయచోటి : గూడు లేక, అద్దె చెల్లించలేక కుటుంబ జీవనం బరువై అల్లాడుతున్న పేదలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆపద్బాంధవుడిలా నిలిచారు. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అర్హులందరికీ సొంతింటి కల సాకారం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాన్ని గాలికి వదిలేయగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణం చేపట్టి.. పేదలకు ఆసరాగా నిలిచారు.

- 2019 ఎన్నికల మేనిఫెస్టోలో పేదలందరికీ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్టుగానే ఇళ్ల నిర్మాణ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద ప్రభుత్వం లక్షా 80 వేల రూపాయలు అందిస్తోంది. భూమిని సేకరించేందుకు, మౌలిక సదుపాయాల కల్పనకు ఇతరత్రా ఖర్చు చేస్తోంది. అన్నమయ్య జిల్లాలో మొత్తం 513 లే అవుట్లలో 72921 ఇళ్లు నిర్మించాలని తలపెట్టింది. గత సెప్టెంబర్ 22 వరకు 25748 ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి రాష్ట్రంలోనే ఐదో స్థానంలో నిలిచిందని హౌసింగ్ అధికారులు తెలిపారు. ఇవి కాకుండా ఆర్‌సీ స్థాయిలో 4422, ఆర్ఎల్ స్థాయిలో 7209, బీఎల్ స్థాయిలో 21043, బీబీఎల్ స్థాయిలో 12890 ఇళ్లు, ఇంకా ప్రారంభించనివి 1609 ఉన్నాయని తెలిపారు.



అందమైన రహదారి

అర్హులకు సొంతిళ్లు అందించడమే లక్ష్యం



జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో గృహనిర్మాణం చేపడుతోంది. పేదలందరికీ గౌరవప్రదమైన జీవితం కోసం, విద్య, వైద్యం సొంత ఇల్లు అందించడమే లక్ష్యం. రాయచోటి నియోజకవర్గంలోని నారాయణపల్లి లేఔట్ లో ఇళ్ల నిర్మాణానికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు.

– శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాయచోటి

నాణ్యతతో ఇళ్ల నిర్మాణాలు



ముఖ్యమంత్రి పేదల పక్షపాతి. సీఎం ఆదేశాల ప్రకారం ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి లోపాలు లేకుండా,నాణ్యతతో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇళ్ల నిర్మాణంలో ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల సహకారం ఉంది. వారందరికీ కృతజ్ఞతలు. – గిరీషా పీఎస్, కలెక్టర్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. ఇళ్ల పథకంలో తానూ భాగస్వామిని అయినందుకు సంతోషంగా ఉంది. పేదలందరూ ఇళ్లలో చేరి సంతోషంగా ఉండాలి. – శివయ్య, జిల్లా హౌసింగ్ అధికారి

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

రాయచోటి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని అందుకు అనుగుణంగా రోగులు సంతృప్తి చెందేలా వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పూనం మాలకొండయ్య వీడియో కాన్ఫరెన్స్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన ఉందన్నారు. అక్టోబర్ 4వ తేదీ వరకు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 73చోట్ల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, పట్టణ ప్రాంతాలలో మూడుచోట్ల ఏర్పాటు చేసినట్లు పూనం మాలకొండయ్యకు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఆరోగ్యశాఖ అధికారులు, గ్రామ వార్డు సచివాలయ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసే ప్రాంతాల్లో లోపాలు లేకుండా చూసుకోవాలని, ముఖ్యంగా ఫోల్డర్లు, బ్యాగుల కొరత ఉండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ కొండయ్య, డీసీహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి మనోహర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అరటి ఉత్పత్తుల్లో ప్రపంచస్థాయి గుర్తింపు

పులివెందుల రూరల్: అరటి ఉత్పత్తుల్లో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన వైఎస్సార్ జిల్లాలో బనానా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో మార్కెటింగ్ మరింత పెరుగుతుందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంత్రులు, కార్యదర్శులతో కలిసి పులివెందుల మండలం బ్రాహ్మణపల్లెలో రూ.4.827 కోట్లతో ఏర్పాటుచేసిన బనానా ప్రాసెసింగ్ యూనిట్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అరటి ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభంతో ఆ ప్రాంత రైతుల్లో పండగ వాతావరణం నెలకొందని కలెక్టర్ విజయరామరాజు ముఖ్యమంత్రికి విన్నవించారు.

రూ.10 కోట్లతో హజ్‌హౌస్‌కు నూతన శోభ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమ శాఖామంత్రి అంజద్‌బాషా

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: హజ్ హౌస్‌లో రూ.10 కోట్లతో మౌలిక వసతులు కల్పించి జిల్లా వాసులకు అందుబాటులోకి తెస్తామని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. హజ్ హౌస్ అభివృద్ధిపై వైఎస్సార్ జిల్లా కడప మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... హజ్ హౌస్ పనులను ఐదు ప్యాకేజీలుగా విభజించి ఒక్కొక్క దానికి రూ.2 కోట్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించారన్నారు. ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ అధికారులు తొలి విడతగా నాలుగు లిఫ్టులు, రెండో విడతగా థర్డ్ ఫ్లోర్ నుంచి ఫిఫ్త్ ఫ్లోర్ వరకు కిటికీలు, షటర్లు, తలుపుల ఏర్పాటు, కెనాల్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు వరద నీరు చేరకుండా గోడ నిర్మాణం చేపడతామన్నారు. మూడో విడతగా హైవే నుంచి కెనాల్ పై వంతెన నిర్మించి అప్రోచ్ రోడ్ నిర్మిస్తామని, పార్కింగ్‌కు స్థలం కేటాయిస్తామని తెలిపారు. నాలుగో విడతలో ప్రహరీ, ఇతర పనులు, ఐదో విడతలో మొక్కల పెంపకం చేపడతామన్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు పూర్తి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో అబ్దుల్‌ఖాదర్, కమిటీ చైర్మన్ గౌస్‌లాజం పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డి సర్కిల్: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, పది నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, బి.ఫార్మసీ, ఎంబీఏ ఉత్తీర్ణులైన వారు రావచ్చునని తెలిపారు. ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చిరుధాన్యాలతో 'ఆరోగ్యసిరి'

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



పీలేరు మండలం గూడరేవులపల్లిలో ఏర్పాటు చేయనున్న సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తదితరులు

రాయచోటి: అనేక పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలతో సమాజంలో ఆరోగ్య సిరి పెంపొందుతుందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రూ.2958.69 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఏడు పరిశ్రమలు, ఆరు ఫుడ్‌ప్రాసెసింగ్, 13 సెకండరీ మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభోత్సవం, భూమిపూజ శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా పీలేరు మండలం గూడరేవులపల్లిలో రూ.4.41 కోట్లతో ఏర్పాటు చేయనున్న సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను శిలాఫలకాన్ని సీఎం వర్చువల్‌గా ఆవిష్కరించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జరిగిన ఈ వర్చువల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజులు పాల్గొన్నారు. వర్చువల్ కార్యక్రమం ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందన్నారు. పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు ఇచ్చి రైతులను చిరుధాన్యాల సాగు పెంచే విధంగా ప్రోత్సాహిస్తోందన్నారు. గూడరేవులపల్లిలోని యూనిట్ సామర్థ్యం రోజుకు ఆరు టన్నుల ఉత్పత్తి ఉంటుందని,దీని ద్వారా 20 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 2 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

- పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులు, మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో నాణ్యమైన పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడంపై దృష్టి సారించారన్నారు. పీలేరు నియోజకవర్గంలో చిరుధాన్యాల సాగు పెంపునకు కృషి చేస్తున్నాం .నియోజకవర్గానికి సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు చేసిన సీఎంకు రైతులందరి తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.
- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి చిరుధాన్యాలు తోడ్పడుతాయన్నారు. అనంతరం పీలేరు మండలం గూడరేవులపల్లిలో రూ.4.41 కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేయనున్న సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిటు శిలాఫలకాన్ని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ పంటలకు రైతులకు అందిస్తున్న మద్దతు ధర్మప్రచార పోస్టులను ఆవిష్కరించారు.

సత్తా చాటి..పతకం పట్టి

- రోప్ స్కిప్పింగ్‌లో విద్యార్థుల సత్తా
- జాతీయస్థాయిలో రాణిస్తున్న వైనం





రోప్‌స్కిప్పింగ్‌లో సాధన చేస్తున్న జెడ్పీ పాఠశాల విద్యార్థులు

మదనపల్లె సిటీ: రోప్ స్కిప్పింగ్ ఇదొక అరుదైన క్రీడ. ఇలాంటి ఆటపై ఆసక్తి పెంచుకుంటున్నారు మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. పాఠశాలలో సుమారు 30 మందికిపైగా వివిధ ప్రాంతాల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. గత నెలలో కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి రోప్‌స్కిప్పింగ్‌లో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించారు. పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డు రావడం వెనుక వీరి కృషి ఉంది. తూర్పుగోదావరి జిల్లా భీమవరం, ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని నైనిటాల్, ముంబైలలో జరిగిన జాతీయ స్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు.

పతకాల వీరుడు అఖిల్



ఎస్.అఖిల్‌నాయుడు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు మధుకర్, శిరీష. తండ్రి ఆటో డ్రైవర్. చిన్నప్పటి నుంచి అఖిల్‌కు క్రీడలపై ఆసక్తి ఎక్కువ. పీడీ సుధాకర్ ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో రోప్‌స్కిప్పింగ్‌లో రాణిస్తున్నాడు. పతకాలు సాధిస్తున్నాడు. కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గోల్డ్ 1, స్విలర్ 3 సాధించాడు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయిలో రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొని సిల్వర్ పతకం, మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగిన పోటీల్లో రెండు బంగారు, ఒక క్యాంస పతకాలు సాధించారు. జాతీయస్థాయిలో రాణించాలన్నదే తన ఆశయమని అఖిల్‌నాయుడు చెబుతున్నారు.

సత్తా చాటుతున్న జస్వంత్



జస్వంత్ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. తల్లిదండ్రులు శ్రీనివాసులు, చంద్రకళ, తండ్రి బిల్డర్. ఇటీవల కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గోల్డ్ 1, సిల్వర్ 2, బ్రాంజ్ 1 సాధించాడు. జాతీయస్థాయి పోటీల్లో భోపాల్‌లో గోల్డ్‌మెడల్, గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం, భీమవరంలో రజత పతకం సాధించారు. జిల్లా స్థాయిలో 15 పతకాలు సాధించారు. క్రీడల్లో రాణించి దేశానికి పేరు ప్రఖ్యాతులు తెస్తానని జస్వంత్ అంటున్నాడు.

ఆటల్లో దిట్ట రిహాన్



రిహాన్ స్థానిక జెడ్పీ హై స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు నూరుల్లా, నీలూఫర్. రిహాన్‌కు చిన్నతనం నుంచి క్రీడలపై ఆసక్తి. జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగిన పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయిలో గుంటూరు సత్తెనపల్లి, కర్నూలులో జరిగిన పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో క్రీడల్లో మరింత వన్నె తెస్తానని రిహాన్ అంటున్నాడు.

ప్రతిభ చూపుతున్న రమ్య



రమ్య స్థానిక జెడ్పీ హై స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తుంది. తల్లిదండ్రులు నాగార్జునరెడ్డి, సరళ. తండ్రి దినసరి కూలి. పీడీ సుధాకర్ సలహాలు, సూచనలతో రోప్‌స్కిప్పింగ్‌లో రాణిస్తోంది. జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగిన పోటీల్లో రజతపతకం సాధించింది. రాష్ట్ర స్థాయిలో కర్నూలు, గుంటూరు,భీమవరంలలో జరిగిన పోటీల్లో బంగారు పతకాలు సాధించింది. పీడీ సహకారంతో క్రీడల్లో మంచి పేరు తెస్తానని రమ్య చెబుతోంది.

క్రీడల్లో వికసిస్తున్న ఉష



ఉష స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు రమేష్, స్వర్ణలత. తండ్రి రైతు. చదువుతో పాటు క్రీడల్లో చురుగ్గా ఉండటంతో పీడీ సుధాకర్ గుర్తించి ప్రోత్సహించారు. కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయిపోటీల్లో గోల్డ్ స్విలర్ మెడల్స్ సాధించింది. జాతీయ స్థాయిలో భోపాల్‌లో జరిగిన పోటీల్లో రజతపతకం సాధించింది. భవిష్యత్తులో ఒలపింక్స్ పోటీల్లో పాల్గొని మంచి పేరుతీసుకువస్తానని ఉష చెబుతోంది. వీరితో పాటు ప్రేమతేజ, యశ్వంత్, తరుణ్, తేజేష్, చంద్రకాంత్, బిపిన్‌చౌదరి, దివ్య, కుసుమ, కీర్తన, చైతన్యప్రియలు రాణిస్తున్నారు. విద్యార్థులకు పీడీలు సుధాకర్, శరత్ పర్యవేక్షణలో శిక్షణ కొనసాగుతోంది.

రాణిస్తున్నారు



పాఠశాలల్లో విద్యార్థులు రోప్ స్కిప్పింగ్‌లో రాణిస్తున్నారు. జిల్లాలో మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఈ ఆటలో జాతీయ,రాష్ట్ర స్థాయిల్లో మెడల్స్ సాధించడం సంతోషం. పాఠశాలకు మంచి పేరు తెస్తున్నారు.

-సుధాకర్, పీడీ, జెడ్పీహెచ్ఎస్.మదనపల్లె

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత



పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ముఖ్యంగా రోప్‌స్కిప్పింగ్‌లో విద్యార్థులు గోల్స్ మెడల్స్ సాధించి పాఠశాలకు మంచి పేరు తెస్తున్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నాం.

-సుబ్బారెడ్డి, హెచ్ఎం.జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

క్లుప్తంగా

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్మనపల్లె మండలం అగ్రహారం పంచాయతీ ఆరిపిరెడ్డిగారిపల్లెకు చెందిన ఎన్.చిన్నప్ప(65) కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటివద్దే పురుగుమందు తాగాడు. అదేవిధంగా బి.కొత్తకోట పట్టణం పోకనాటివీధి ఆర్ఎస్ఎం రోడ్డులో నివాసం ఉన్న సత్యనారాయణ భార్య కె.సరోజమ్మ(48) భర్తతో గొడవపడి పురుగుల మందు తాగింది. వీరిని గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చీటింగ్ కేసులో నిందితుడి అరెస్టు

కేవీపల్లె : చీటింగ్ కేసులో ఓ నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నూతనకాల్వ పంచాయతీ ఒంటిల్లుకు చెందిన వల్లెపు రామాంజులు ప్రస్తుతం తిరుపతి కొర్లగుంటలో నివాసం ఉంటున్నాడు. అతను ఓ చీటింగ్ కేసులో నిందితుడిగా ఉండటంతో బుధవారం తిరుపతిలో అరెస్టు చేశామన్నారు. పీలేరు అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బొలేరో వాహనం

– ఇద్దరికి తీవ్రగాయాలు



బొలేరో వాహనం ఢీకొని గాయపడిన గణేష్

మదనపల్లె : ద్విచక్రవాహనాన్ని బొలేరో పికప్ వాహనం ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం రామసముద్రం మండలంలో జరిగింది. చెంబకూరు పంచాయతీ ఎగువపల్లెకు చెందిన జి.గణేష్(63), పోతరాజులపల్లెకు చెందిన రామమూర్తి(45) తో కలిసి ద్విచక్రవాహనంలో ఎగువపల్లె నుంచి చెంబకూరుకు వస్తుండగా, మదనపల్లె నుంచి చెంబకూరుకు వస్తున్న బొలేరో పికప్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గణేష్, రామమూర్తిలు తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. రామసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆహ్లాదం.. ఆనందం!

కొండ కోనల్లో.. మైమరపించే 'అంగళ్లు' మల్లయ్య కొండ



మదనపల్లె దగ్గరున్న అంగళ్లు మల్లయ్య కొండ (ఇన్‌సెట్) అంగళ్లు మల్లయ్యకొండపైకి తారు రోడ్డు

కురబలకోట : ఎక్కడైనా ప్రకృతి రమణీయ దృశ్యాలు కన్పిస్తే...ఈ కొండ కోనల్లో..నీ రెండ చాయల్లో..ఈ ఎండి మబ్బుల్లో నీవే..ఈ వాగు వంకల్లో ఈ ఏటి తరగల్లో తెల్లాటి నురగల్లో నేనే..ఎన్నేళ్ల ఎన్నాళ్ల సావాసమో..అనే ప్రేమామృత వలపుల మధుర సినీ గీతం గుర్తుకు రాకమానదు. ఇలాంటి ప్రదేశాన్ని కురబలకోట మండలంలోని అంగళ్లు దగ్గరున్న మల్లయ్య కొండ తలపింపజేస్తోంది. ఇక్కడి కొండ కోనలతో ప్రశాంత వాతావరణానికి మారుపేరుగా నిలుస్తోంది.

ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో అంగళ్లు పేరు తెలియని వారు అరుదు. ఐదు కిలోమీటర్ల దూరంలో ఈ కొండ ఉంది. హిల్ స్టేషన్. ప్రకృతి దృశ్యాలకు నెలవుగా ఉంటోంది. మదనపల్లె పట్టణానికి దగ్గరగా ఉన్న ఇక్కడ కొండపై నుండి చూస్తే చుట్టూ ఆహ్లాదకర ప్రాంతం కన్పిస్తుంది. మనస్సును తేలిక పరుస్తుంది. బయట ప్రాంతాలకు టూర్లు విహార యాత్రలకు వెళ్లలేని వారు ఈ కొండను సందర్శిస్తే హాయిగా అన్పిస్తుంది. కొండపై నుండి చూస్తే చుట్టూ కొండల మధ్యలో బండి చక్రం ఇరుసులా ఈ కొండ కన్పిస్తుంది. పక్కనే హార్సిలీహిల్స్, రిషివ్యాలీ ప్రాంత గాలి ఈ కొండవైపుగా వీస్తుంది.

కొండపైకి విశ్వం కళాశాల పక్కగా తారు రోడ్డు ఉంది. వాహనాలు కూడా వెళతాయి. మదనపల్లె నుండి అరగంట ప్రయాణం అంతే. కొండపై నుండి చూస్తే మదనపల్లె, తంబళ్లపల్లెతో పాటు పరిసర ప్రాంతాలు కన్పిస్తాయి. పచ్చిక భూములు, పచ్చని పొలాలు, చెరువులు ప్రకృతి పచ్చని పైట కప్పుకున్నట్లుగా కనువిందు చేస్తాయి. ఆస్వాదించే మనస్సుంటే చాలు. ఎంతో హాయి అన్పిస్తుంది. సెలవు రోజుల్లో పిల్లలతో పెద్దలు వస్తుంటారు. తరచూ ప్రేమ పక్షులు కూడా వాలుతుంటాయి. వాకింగ్, వర్కౌట్లు, ట్రెక్కింగ్ చేసేవారికి ఇదొక వరం. ప్రకృతి ఒడిలో సేదదీరినట్లే. కొత్తవారు ఒక్కసారి వచ్చి చూస్తే అరెరె..ఇంత దగ్గరగా ఉన్న కొండను ఇన్నాళ్లు మిస్సయ్యామే అన్పించకమానదు.

అనారోగ్యంతో ఉన్న వారు ఇక్కడ కొన్నాళ్లు ఉండి సంతోషంగా వెళతారు. బస చేయడానికి కొండపై రూములు కూడా ఉన్నాయి. ప్రశాంతమైన ప్రదేశం, ఆస్వాదించే మనస్సుండాలే కాని ప్రకృతి ప్రేమికులు ఎంజాయ్ చేస్తుంటారు. కొండకు రావడం వరకే మన చేతుల్లో ఉంది. ఆ తర్వాత కొండను విడిచి వెళ్లాలంటే మనసు మాట వినదు. కొండపై మేఘాలు ముద్దాడుతున్నట్లుగా కదులుతుంటాయి.

కొండపై అఖండ మల్లేశ్వరుడి గుడి కూడా ఉంది. ప్రతి ఏటా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. అటు ఆధ్యాత్మికత ఇటు ఆహ్లాదకర వాతావరణం మరో వైపు ప్రకృతి రమణీయ దృశ్యాలు, ఇంకో వైపు వీచే చిరుగాలులు మనసుకు హాయి గొలిపిస్తాయి. ఇక్కడ వాతావరణం నచ్చి వివిధ ప్రాంతాల వారు వివాహాలు ఇతరత్రా వేడుకలు కూడా నిర్వహిస్తున్నారు. అందుకే మల్లయ్యకొండను ప్రకృతి ప్రేమికులు హాయ్ హిల్స్, హెల్త్ హిల్స్‌గా పిలుస్తుంటారు. పచ్చదనం, చిరుగాలులతో మాట్లాడాలంటే మల్లయ్య కొండకు ఒక్కసారైనా వచ్చి తీరాల్సిందేనని చెబుతుంటారు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి కృషి



ఇక్కడి స్వచ్ఛమైన గాలి శరీరాన్ని, ఆరోగ్యాన్ని ఆపై ఆత్మను పునరుజ్జీవింప జేస్తుంది. ఒత్తిడిని దూరం చేస్తుంది. అవుట్‌డోర్ జిమ్ సెంటర్, గుడిసెలు (హట్స్), పిల్లల పార్కు, ఉద్యాన వనం, పిరమిడ్లు, వాకర్స్ ఫుట్ పాత్, గెస్ట్ రెస్ట్ హౌస్ ఏర్పాటు చేయ సంకల్పించాం. ఉద్యానవనంతో పాటు ఔషధ మొక్కలు పెంచుతాం. వివిధ వేడుకలకు ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేస్తాం. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సహకారం, నాయకుల ప్రోత్సాహంతో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

– కాకర్ల కృష్ణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్, అంగళ్లు మల్లయ్యకొండ, కురబలకోట మండలం

21న ప్రత్యేక లోక్ అదాలత్

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక లోక్ అదా లత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్మన్ జి. శ్రీదేవి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో మోటార్ వాహనాల ప్రమాదాలకు సంబంధించిన కేసులు (ఎం.వి.ఓ.పి కేసులు), రెవెన్యూ కేసులు మాత్రమే రాజీ చేసుకో వచ్చన్నారు. మరింత సమాచారం కోసం 08562- 258622, 244622 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. లేదా ఈమెయిల్ అడ్రస్: డిస్ట్రిక్ట్స్.ఈకోర్ట్స్.జీఓవి.ఐఎన్/కెఏడీఏపీఏ, డీఎల్ఎస్ఏకేడీపీఅట్‌ది డేటా ఫ్ జీమెయిల్.కామ్‌ను ఉపయోగించుకోవాలన్నారు.

బాలుడు అదృశ్యం



పి. గణేష్ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలో తిలక్‌నగర్‌లో నివాసం ఉంటున్న పాలపర్తి గణేష్ (13) ఈనెల 3వ తేదీన ఉదయం 9:30 గంటల నుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకీ తెలిసినవారు కడప రిమ్స్ సీఐ కె. రామచంద్ర సెల్ నంబర్: 91211 00523, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి సెల్ నంబర్. 91211 00524లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని యువకుడి దుర్మరణం

ముద్దనూరు : మండలంలోని యామవరం గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొని గంగన్న(35) అనే యువకుడు దుర్మరణం చెందాడు. సీఐ నరేష్ బాబు సమాచారం మేరకు మండలంలోని ఆరవేటిపల్లెకు చెందిన గంగన్న రాయలసీమ థర్మల్ కేంద్రంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తాడిపత్రిలో ఉన్న అతని భార్య వద్దకు మోటార్ బైక్‌పై వెళ్తుండగా యామవరం దగ్గరకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఢీకొన్న వాహనం గంగన్నను సుమారు 50 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తప్పిన ప్రమాదం

– బోల్తా పడిన ఇటుకల ట్రాక్టర్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలో ఉన్న జగనన్న కాలనీలో ఇటుకలను తీసుకెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ కిందకు దూకి తప్పించుకున్నాడు. జగనన్న కాలనీలో నిర్మాణ పనులు చేపట్టడానికి ఇటుకలను తీసుకుని వెళ్లే క్రమంలో రోడ్డుపై గుంతలు ఎక్కువగా ఉండటంతో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ మార్గంలో ఇంటి సామగ్రి తీసుకెళ్లాలంటే అవస్థలు పడుతున్నామని, అధికారులు రోడ్లు వేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ గుణశేఖర్ పిళ్లై



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ డాక్టర్ గుణశేఖర్ పిళ్లై

రాయచోటిటౌన్ : ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గుణశేఖర్ పిళ్లై అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని మాసాపేటలోని శ్రీ సాయి శుభ కల్యాణ మండంలో జాతీయ లైవ్ స్టాక్ మిషన్‌పై ఔత్సాహికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధి చెందేందుకు, మాంసం ఉత్పత్తులు పెంచేందుకు అనేక సబ్సిడీలతో కూడిన రుణాలు అందిస్తోందని తెలిపారు. అయితే ఈ పథకం పూర్తి స్థాయిలో ప్రజలకు తెలియకపోవడంతో రైతులు సద్వినియోగం చేసుకోలేకపోయారన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం 2022-2023 సంవత్సరానికి రైతులను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. పాడి రైతులకు బ్యాంకుల ద్వారా 50శాతం సబ్సిడీతో రూ.10 లక్షల నుంచి రూ. కోటి వరకు రుణాలు అందిస్తోందన్నారు. అలాగే గొర్రెల పెంపకందారులకు, పందుల పెంపకం దారులకు, కోళ్ల పెంపకందారులకు కూడా ఇలాగే సబ్సిడీతో రుణాలు అందిస్తోందన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బోదేశీ వలి, రవికుమార్ రెడ్డి, దిన్నెపాడు రవిరాజు, పశుగణాభివృద్ధి చైర్మన్ సతీష్‌కుమార్, జిల్లా గొర్రెల సహకార సంఘం యూనియన్ చైర్మన్ నాగమల్లేశ్వర్ యాదవ్‌లు ఔత్సాహికులకు పాడి, మాంసం ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఉప సంచాలకుడు డాక్టర్ మాలకొండయ్య, మదనపల్లె ఉప సంచాలకులు డాక్టర్ రెడ్డి వరప్రసాద్, డాక్టర్ కె. రంగయ్య, డాక్టర్ వై. విజయ భాస్కర్ రావు, రాజంపేట, ఏడీ డాక్టర్ ఎ.రంగయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ఉన్న పశుసంవర్ధకశాఖ డాక్టర్లు, అధికారులు, ఇతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి



మృతిచెందిన నాగరాజు

కలకడ : ప్రత్యర్థుల దాడిలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని కోన గ్రామానికి చెందిన రామకృష్ణ కుమారుడు నాగరాజు(26) పై అదే గ్రామానికి చెందిన నాగయ్య, శ్రీరాములు ఆదివారం రాత్రి కత్తితో దాడిచేశారు. చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు అక్కడి వైద్యులు సమాచారం అందించారని పోలీసులు తెలిపారు.

పాడి పశువులతోనే రైతులకు ఆర్థికాభివృద్ధి

– కడప డివిజన్ ఉపసంచాలకుడు రమణయ్య



రైతుల బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న కడప డివిజన్ ఉపసంచాలకుడు

కడప అగ్రికల్చర్ : గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశువులతోనే రైతులు ఆర్థికాభివృద్ధిని సాధించగలరని పశుసంవర్ధక శాఖ కడప డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ రమణయ్య పేర్కొన్నారు. జాతీయ పశు గణన మిషన్‌లో భాగంగా ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణ సంస్థ కర్నూలు వారి ఆధ్వర్యంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ఆదర్శ పాడి రైతులు మూడు రోజులపాటు అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలోని శ్రీ ప్రకాష్ సమగ్ర డైరీ ఫారంకు అవగాహన కోసం క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు వెళ్లే బస్సును బుధవారం కడప కోటిరెడ్డిసర్కిల్‌లోని జిలా పశుసంవర్ధకశాఖ కార్యాలయం వద్ద కడప డివిజన్ ఉపసంచాలకుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయం కష్టతరంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో పాడి పశువుల పెంపకం అనేది ఎంతో మేలన్నారు. ఇందుకోసం రైతులకు పాడిపరిశ్రమపై మరింత అవగాహనతోపాటు అక్కడ వారు అవలంబిస్తున్న యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ సదుపాయాలు తెలుసుకునేందుకు రైతులను క్షేత్రస్థాయి పర్యటన కోసం పాయకరావుపేటలో ఉన్న సమగ్ర డైరీఫాంకు పంపుతున్నామన్నారు. అక్కడ వారు అవలంబిస్తున్న పద్ధతులను ఇక్కడ పాటించి పాడి పరిశ్రమను లాభసాటిగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బహుళార్థ పశువైద్యశాల ఉపసంచాలకుడు డాక్టర్ రంగస్వామి, కడప డివిజన్ సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, సందర్శన కో ఆర్డినేటర్ డాక్టర్ సతీష్, రైతులు పాల్గొన్నారు.

పోలీసు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం



పోలీసు సంక్షేమ కమిటీ సభ్యులతో సమావేశమైన వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి వారి కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను రూపొందిస్తామని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీసు సంక్షేమ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం పోలీసులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ఎలాంటి సంక్షేమ చర్యలు అమలవుతున్నాయో సమీక్షించారు. వీటిని కొనసాగించడంతో పాటు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. సిబ్బంది తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకుని వచ్చేందుకు వీలుగా ప్రతి శుక్రవారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తామన్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. సిబ్బంది తమ ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ బి. రమణయ్య, డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్ఐలు వీరేష్, సోమశేఖర్ నాయక్, శ్రీశైలం రెడ్డి, ఆర్ఎస్ఐ రామస్వామిరాజు, జూనియర్ అసిస్టెంట్ మహజబీన్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

టియర్ గ్యాస్‌ను సమర్థవంతంగా వినియోగించాలి

అల్లరి మూకలను చెదరగొట్టడంలో టియర్‌గ్యాస్ (బాష్ప వాయువు) కీలకపాత్ర పోషిస్తుందని, అవసరమైన సమయాల్లో టియర్ గ్యాస్ సమర్థవంతంగా వినియోగించి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. బుధవారం కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణంలో టియర్ గ్యాస్ పరికరాలను, షెల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏ.ఆర్.డీఎస్పీ బి. రమణయ్య, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ యు. వెంకటకుమార్, ఆర్ఐ వీరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధిక్యంలో నెల్లూరు జట్టు



సాకేత్‌రామ్, నెల్లూరు (5 వికెట్లు)



జాఫర్‌అలీఖాన్, కడప (75 పరుగులు)



అనిల్, చిత్తూరు (4 వికెట్లు)

కడప స్పోర్ట్స్: ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు, చిత్తూరు జట్లు ఆధిక్యాన్ని ప్రదర్శించాయి. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 43 ఓవర్ల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు రెండోరోజు బుధవారం 38.5 ఓవర్లలో 186 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని జాఫర్‌ఆలీఖాన్ 75 పరుగులు, సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి 44 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు సాకేత్‌రామ్ 5 వికెట్లు, సాత్విక్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 59 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. జట్టులోని నిఖిలేశ్వర్‌రెడ్డి 72 పరుగులు, రేవంత్‌రెడ్డి 79 పరుగులు చేశారు. కడప బౌలర్ అస్లాం 2 వికెట్లు తీశాడు. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 354 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో నెల్లూరు జట్టు 357 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

చిత్తూరు జట్టుకు ఆధిక్యం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో 16 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 59 ఓవర్లలో 139 పరుగులు చేసింది. జట్టులోని యోగానంద 42 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ అనిల్ 4, మల్లేశన్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. జట్టులోని తేజారెడ్డి 60 పరుగులతో క్రీజులో ఉన్నాడు. కాగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 243 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో చిత్తూరు జట్టు 272 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

మహిళ దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు





గౌసియాబేగం మృతదేహం, సుభహాని(ఫైల్)

పోరుమామిళ్ల : పట్టణంలోని ముస్లింకోటలో మంగళవారం రాత్రి ఓ మహిళ దారుణహత్యకు గురైంది. పోలీసుల కథనం మేరకు.. షేక్ గౌసియాబేగం (38) స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో (ఔట్ సోర్సింగ్) కూలి పని చేసేది. ఆమె భర్త పదేళ్ల క్రితం మృతి చెందాడు. ఇద్దరు ఆడపిల్లలతో ఆమె కూలి పని చేసుకుని జీవనం సాగిస్తోంది.ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన సుభహాని (24) అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఇటీవల సుభహాని కువైట్ వెళ్లి వచ్చాడు. ఆమెకు ఆర్థికంగా సహాయం కూడా చేశాడు. ఈ నేపథ్యంలో గౌసియాబేగం పెద్ద కూతురును తనకిచ్చి పెళ్లి చేయమని సుభహాని అడిగాడు. ఇందుకు ఆమె అంగీకరించకపోగా ఇటీవల కూతురుకు గిద్దలూరులో సంబంధం ఖాయం చేసుకుంది. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్న సుభహాని పథకం ప్రకారం మంగళవారం రాత్రి ఉర్దూ స్కూలుకు పిలిచి హత్య చేసి మృత దేహాన్ని బాత్‌రూమ్‌లో పడేసి వెళ్లాడు. హత్య అనంతరం నిందితుడు నేరుగా పోలీస్‌స్టేషన్ వెళ్లి హత్య విషయం చెప్పాడు. లేకపోతే బుధవారం ఉదయం పాఠశాల తెరిచేంతవరకు ఈ విషయం వెలుగు చూసేది కాదు. ఈ సంఘటనపై ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బుధవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీతో పోలీసు సిబ్బంది

చెన్నూరు : చెన్నూరు అరుంధతినగర్ వద్ద అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న 235 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. చెన్నూరులో నివాసముంటున్న కాటం వీర బ్రహ్మయ్యకు చెందిన ఐచర్ లారీ ద్వారా ప్రభుత్వ చౌక బియ్యాన్ని అక్రమంగా రవాణా చేయనున్నారని పక్కా సమాచారం అందడంతో తమ సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా లారీలో ఉన్న 235 బస్తాల చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.